AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
21-1-2026 (Wednesday) MAIN EDITION

## మున్సిపల్ ఎన్నికల్లో పోటీపై కవిత కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో తాము పోటీ చేయబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. జాగృతి ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారలేదన్నారు. జాగృతి మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. దీనిపై తాజాగా కవిత క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా కవిత నివాళులర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై సత్యనారాయణ రాసిన పాటలు ఆంధ్రా పాలకులకు తూటాలై తగిలాయని చెప్పారు.

## అదనపు కలెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు



**అక్షరటుడే, హైదరాబాద్:** హన్మకొండ అదనపు కలెక్టర్ ఇంట్లో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించినట్లు అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో అధికారులు బుధవారం సోదాలు చేపట్టారు. హైదరాబాద్, మిర్యాలగూడ, నల్గొండలోని ఆయన నివాసాలతో పాటు బంధువుల ఇళ్లలో సైతం సోదాలు చేశారు. ఆయన భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు సమాచారం. గత నెలలో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఈ క్రమంలో తాజాగా తనిఖీలు జరిగాయి.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ఆకాశమే హద్దుగా బంగారం ధరలు దూసుకెళ్తున్నాయి. ఇవాళ మరోసారి ఆల్ టైమ్ హైని టచ్ చేశాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.1,52,000 దాటింది. దీంతో పాటు సిల్వర్ రేట్లు కూడా పరుగులు పెడుతున్నాయి. కిలో ధర రూ.3,39,900 పైనే పలుకుతోంది.

## కాంగ్రెస్‌వి దిగజారుడు రాజకీయాలు



**అక్షరటుడే, హైదరాబాద్:** అలంపూర్ ఎమ్మెల్యే విజయుడిపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి దుర్భాషలాడుతూ చేయిచేసుకోవడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రతిపక్షాన్ని భయపెట్టేందుకు, గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారిన రాజకీయానికి ఇది నిదర్శనమని 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## ఓటర్ల జాబితా శుద్ధీకరణలో బీహార్ రికార్డు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఓటర్ల జాబితా శుద్ధీకరణలో బీహార్ సరికొత్త రికార్డు సృష్టించిందని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. భారత ప్రజాస్వామ్యానికి ఓటర్ల జాబితా పునాది వంటిదని పేర్కొన్నారు. బీహార్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల ప్రక్రియలో ఈ జాబితా శుద్ధీకరణ అద్భుతంగా జరిగిందని కేంద్ర ఎన్నికల కమిషనర్ కొనియాడారు.



# పెట్టుబడుల వెల్లువ

■ దావోస్ వేదికగా ముందుకు వస్తున్న కంపెనీలు ■ పలు సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు
■ హైదరాబాద్ డబ్ల్యూఈఎఫ్ సమావేశాలు ■ ప్రతిపాదించిన సీఎం రేవంత్‌రెడ్డి

**దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశంలో తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం పాల్గొంది. ఈ బృందం రెండు రోజులుగా పలు సంస్థలతో సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి అనేక కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ మేరకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. ప్రముఖ బ్యూటీ టెక్ సంస్థ లోరియల్ తన తొలి జీసీసీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.**

**—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

దావోస్‌లో జాయిన్ ది రైజ్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి సంవత్సరం జూలైలో హైదరాబాద్‌లో వార్షిక డబ్ల్యూఈఎఫ్ ఫాలోఅప్ సమావేశం నిర్వహించాలని ఆయన ప్రతిపాదించారు. ఆధునిక వ్యాపార చక్రాలలో ఫాలోఅప్‌లు, పెట్టుబడి నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా సుదీర్ఘ సమయం అని పేర్కొంటూ, ప్రతి సంవత్సరం జూలై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో మరో ఫాలోఅప్ ఫోరమ్‌ను నిర్వహించాలని ప్రతిపాదించారు. తెలంగాణలో ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని పేర్కొన్నారు. రూ. 5.75 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిందని ఆయన అన్నారు. సాధారణంగా తాము అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయడానికి దావోస్‌కు వస్తామన్నారు. కానీ ఈసారి దార్శనికత, విధానాలను ప్రదర్శించడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.

### కొత్త నగరం నిర్మిస్తున్నాం

హైదరాబాద్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) ప్రపంచ కేంద్రంగా ఎదిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ నదికి ఇరువైపులా రాత్రిపూట ఆర్థిక వ్యవస్థపై దృష్టి సారించి, హైదరాబాద్‌ను 24 గంటలూ పనిచేసే మొదటి నగరంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కొత్త నగరం ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఇది పూర్తిగా స్మార్ట్‌గా, భవిష్యత్తు కోసం రూపొందించినట్లు తెలిపారు. 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో, 50 శాతానికి పైగా ప్రాంతం పచ్చదనంతో కూడిన ఖాళీ స్థలంతో ఈ నగరం ఉంటుందన్నారు.

### లోరియల్ సంస్థ పెట్టుబడులు


ప్రముఖ బ్యూటీ టెక్ కంపెనీ లోరియల్ హైదరాబాద్ నగరంలో భారీగా పెట్టుబడులు పెట్టనుంది. ప్రపంచంలోనే తొలి బ్యూటీటెక్ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి ఆ సంస్థ ముందుకు వచ్చింది. దీనిని ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించనున్నట్లు సంస్థ తెలిపింది.

### బ్లేజ్ ఎలక్ట్రానిక్స్ ఒప్పందం

తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం డేటా సెంటర్, ఏఐ కంప్యూటింగ్ కోసం శక్తి సమర్థవంతమైన ఏఐ హార్డ్‌వేర్, పూర్తిస్టాక్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించే కాలిఫోర్నియాకు చెందిన బ్లేజ్ కంపెనీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

### న్యూక్లియర్ సంస్థ ఆసక్తి

తెలంగాణలో రూ.6 వేల కోట్ల స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ ఆధారిత స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి స్లోవేకియాకు చెందిన న్యూక్లియర్ సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది.



## బేగంపేట ఫ్లైఓవర్‌పై డివైడర్‌ను ఢీకొట్టి గాల్లోకి లేచిన కారు

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని అత్యంత రద్దీగా ఉండే బేగంపేట ఫ్లైఓవర్‌పై బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో రోడ్డుమధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో కారు గాల్లోకి లేచి పల్టీలు కొడుతూ రోడ్డుపై బోల్తా పడింది. ప్రమాదం జరిగిన క్షణాల్లో అక్కడి వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సమయంలో కారులో మొత్తం నలుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి.

## తిరుమలలో ఆర్జిత సేవలు రద్దు

**అక్షరటుడే, తిరుమల :** తిరుమలలో రథ సప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 25న రథ సప్తమి ఉండడంతో ఏర్పాట్లపై బుధవారం టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఈవో ఆదేశించారు. భక్తుల భద్రతకు పెద్ద పీట వేయాలని, టీటీడీ భద్రత విభాగం, జిల్లా పోలీసు యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

## ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగావకాశాలు..

**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన ముంబయిలోని సొసైటీ ఫర్ అప్లయిడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇంజినీరింగ్ అండ్ రీసెర్చ్(సమీర్)లో కాంట్రాక్ట్ బేసిస్‌లో పలు ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఈనెల 25 వరకు దరఖాస్తులకు అవకాశం ఉంది. 147 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆన్‌లైన్ ద్వారా జనవరి 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ https://recruitment.sameer.gov.in లో సంప్రదించండి.

## సింగరేణిపై ఆ పార్టీలు కుమ్మక్కు: పొన్నం



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణకు నిధుల కేటాయింపులో అన్యాయం జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కేంద్రాన్ని అడుగుదామంటే రమ్మంటే ప్రతిపక్ష నేతలెవ్వరూ ముందుకురావడం లేదన్నారు. అలాంటి ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు సింగరేణిపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని, ఆ రెండూ కలిసే తాము సేఫ్‌గా ఉంటామని బీఆర్ఎస్ భావిస్తోందన్నారు. అందుకే కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారన్నారు. తీరా సీబీఐ విచారణకు ఇస్తే.. కిషన్ రెడ్డి, హరీష్ రావు కలిసి సింగరేణి అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు. ఇప్పుడు ఈ విషయంపై సీబీఐ ఎంక్వైరీకి డిమాండ్ చేస్తున్నారని మండిపడ్డారు.

## దావోస్‌లో సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా ఉన్నతాధికారులతో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు రోజులుగా వివిధ దేశాల ప్రతినిధులు, అంతర్జాతీయ సంస్థల సీఈవోలతో జరిగిన చర్చల పురోగతిని సమావేశంలో విశ్లేషించారు. కృత్రిమ మేధ, గ్రీన్ ఎనర్జీ, సెమీకండక్టర్లు, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగాలపై కనబరుస్తున్న ఆసక్తిని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. కుదుర్చుకున్న ప్రాథమిక ఒప్పందాలను వాస్తవ రూపంలోకి తెచ్చేందుకు కృషి చేయాలని సూచించారు.

## ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి విలువ..

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** బంగారం, వెండి ధరలు ఆకాశమే హద్దుగా పెరుగుతున్న వేళ రూపాయి కూడా షాకిచ్చింది. అమెరికన్ డాలర్ వద్ద రూపాయి విలువ ఆల్ టైం కనిష్ఠానికి చేరింది. దీంతో బంగారం, వెండి ధరలు మరింత పెరుగుతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి, విదేశీ ఇన్వెస్టర్లు భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి నిరంతరంగా పెట్టుబడులు ఉపసంహరించుకోవడంతో రూపాయి డాలర్‌తో పోలిస్తే కనిష్ఠానికి పతనమైంది. బుధవారం మధ్యాహ్నం రూపాయి డాలర్‌తో పోలిస్తే 91.7450 స్థాయికి పడిపోయింది.

## నాసా సేవలకు సునీతా విలియమ్స్ రిటైర్‌మెంట్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత సంతతికి చెందిన ప్రముఖ నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ (60) తన సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణానికి అధికారికంగా ముగింపు పలికారు. దాదాపు 27 ఏళ్ల పాటు నాసాలో సేవలందించిన సునీతా, నాసా నుంచి పదవీ విరమణ చేసినట్లు తాజాగా వెల్లడైంది. ఈ నిర్ణయం గత ఏడాది డిసెంబర్ 25 నుంచే అమల్లోకి వచ్చిందని నాసా స్పష్టం చేసింది. అంతరిక్ష పరిశోధనల రంగంలో ఆమె చేసిన సేవలను ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, అంతరిక్ష ప్రేమికులు ఘనంగా కొనియాడుతున్నారు. ఈ సందర్భంగా నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్ సునీతా విలియమ్స్‌ను ప్రశంసిస్తూ, "మానవ అంతరిక్ష ప్రయాణంలో సునీతా విలియమ్స్ ఒక నిజమైన మార్గదర్శకురాలు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఆమె చూపిన నాయకత్వం, టెక్నాలజీ అభివృద్ధికి చేసిన సేవలు భవిష్యత్తులో చంద్రుడు, మార్స్‌పై జరగబోయే మిషన్లకు బలమైన పునాది వేశాయి" అని వ్యాఖ్యానించారు.

## కంటెంట్ బాగుంటే సినిమాకు ఓకే..



**'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన యంగ్ బ్యూటీ రీతికా నాయక్. ఆ తర్వాత 'హాయ్ నాన్న, 'మిరాయ్' చిత్రాలతో మంచి హిట్లు కొట్టింది. దీంతో ఈ భామకు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. ప్రజెంట్ మెగా హీరో వరుణ్ తేజ్ సరసన 'కొరియన్ కనకరాజు' మూవీలో నటిస్తోంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ అమ్మడు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 'నేను సినిమాల విషయంలో ఎక్కువగా చూసేది కంటెంట్. అందుకే కంటెంట్ బాగుంటే వెంటనే ఓకే చెప్తాను. ప్రజెంట్ రెండు సినిమాలు చేస్తున్నాను. అవి కూడా అలా ఎంచుకున్నవే' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.**

**- అక్షరటుడే, సినిమా డెస్క్**

## కూలిన శిక్షణ విమానం..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఓ ట్రైనింగ్ విమానం కూలిపోయింది. నగర శివారులోని చెరువులో విమానం పడిపోయింది. భారత వైమానిక దళ శిక్షణా మైక్రోలైట్ విమానం బుధవారం కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. కేపీ కళాశాల వెనుక ఉన్న చెరువులో ఈ ఘటన చోటు చేసుకుంది. అక్కడ అకస్మాత్తుగా పేలుడు లాంటి పెద్ద శబ్దం వినిపించింది. దీంతో చుట్టుపక్కల ప్రాంతంలో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు అక్కడికి పరిగెత్తుకుని వెళ్లి చెరువులోకి దూకి ముగ్గురిని రక్షించారు. కాగా.. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. పోలీసులు, సహాయ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. చెరువు చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. సాంకేతిక పరీక్షను నిర్వహించడానికి వీలుగా విమానాన్ని చెరువు నుంచి బయటకు తీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై వైమానిక దళ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

